# పాములపుట్ట

సదానందంగారు పెద్ద ప్రభుత్వాధికారి. ఆయన ఆఫీసుకు రోజూ ఎంతోమంది విజిటర్లు వస్తుంటారు. వాళ్ళల్లో డీలర్లూ, యూనియన్ లీడర్లూ, ప్రజా ప్రతినిధులూ, ప్రజా సేవకులూ - ఇలా ఎంతో మంది వుంటారు. విజిటర్లు ఆయన్ని కలవటానికి నిర్ణీత సమయాలు వుంటాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇది రోజూ జరిగే తంతే!

కాని, ఆరోజు నిజంగానే పెద్ద 'తంతు' జరిగింది. ఆరోజు ఒక ప్రత్యేకమైన విజిటర్, అ నిర్ణీత సమయంలో, అదిన్నీ ఆఫీసరు గారి ముందుఅనుమతి లేకుండా, ఎవర్నీ అడగకుండా వేరుగా ఆయనగారి ఛాంబర్‌లోకి రావడం జరిగింది.

ఆ ప్రత్యేకమైన విజిటర్ను చూడగానే ఆఫీసరు గారు హడలి పోయారు. కూర్చున్న కుర్చీలోంచి ఎగిరిపడ్డారు. భయంతో అదిరిపడ్డారు. ఆయనకి నోట మాట పెగల్లేదు.

గజగజా వణికిపోతూ బజర్ మ్రోగించారు.

బజర్ ఒకసారి మ్రోగితే ఆఫీసు ఫ్యూనూ, రెండు సార్లు మ్రోగితే స్టెనో, మూడుసార్లు మ్రోగితే పి.ఏ. లోపలికి రావాలని ఇలా సంకేతాలుంటాయి - ప్రభుత్వ కార్యాలయాల్లో.

ఏకధాటిగా ఇలా మ్రోగుతున్న బజర్ మ్రోతకు ఎవరురావాలో తెలియక, ఆఫీసు ఫ్యూనూ, స్టెనో, పి.ఏ., కారు డ్రైవరూ, హెడ్ క్లర్కూ, అకౌంటెంటూ - ఇలా అందరూ పోలోమంటూ ఆఫీసరు గారి ఛాంబర్ లోకి పరిగెత్తారు.

సదానందంగారు, 'పా-పా-పా-పాము- పాము!' అంటూ గంతులేస్తోన్నారు. చిందులు తొక్కుతున్నారు.

"పామా? ఎక్కడా - ఎక్కడా?" అంటూ అందరూ తలా ఒక మూల చూడసాగారు.

ఆనాటి స్పెషల్ విజిటరయిన ఒక పెద్ద నల్లత్రాచు, ఎర్ర తివాచీ మీద నుంచి అది తనకోసమే ప్రభుత్వం వారు ప్రత్యేకంగా ఇస్తోన్న 'రెడ్ కార్పెట్' వెల్‌కమ్ అన్నంత ఠీవిగా, దర్జాగా, అదొక హేలగా జరజరా ప్రాక్కుంటూ గదంతా కలయతిరిగింది.

మన అనుంగు సోదరులయిన విషధరులు నరులరూపాల్లో ప్రభుత్వ యంత్రాంగాన్ని భేషుగ్గానే నడుపుచున్నార్లే 'ఓకే' అని సంతృప్తి పడ్డదానిలాగా ప్రక్క గుమ్మంలోంచి వెళ్ళిపోయింది.

'పాము, పాము' అంటూ కొంతమంది ధీరులు దానివెంట పడ్డారు.

"నాయన్లారా, మీరే రూపంలో వున్నా, ఏ పొజిషన్లో వున్నా మన 'విషజాతి' వృద్ధి పొందేటట్లు చూడండి!" అని మనస్సులోనే దీవిస్తూ, అది ఆఫీసు ఆవరణలో గుబ్బుగా పెరిగిన దుబ్బుల్లోకి అదృశ్యమైపోయింది.

ఈ గొడవకి ఆఫీసులో వున్న మిగతా సూపర్‌వైజర్లు, బడా గుమస్తాలూ, చోటా గుమస్తాలూ, ఆడ గుమస్తాలూ, మొగ గుమస్తాలూ అందరూ 'ఛలో ఛలో' అంటూ ఆఫీసరు గారి రూంలోకి వచ్చారు. పామును వెతుక్కుంటూ తలా ఒక మూలకి పరుగెత్తారు.

ఆఫీసు ఫైళ్ళలోని రంధ్రాన్వేషణల్లో నిష్ణాతులైన ఆడిటర్లు కన్నాలూ కంతలూ వెతకసాగారు. ఆఫీసు పనుల్లో 'దొడ్డిదార్లు' తెలిసిన దొడ్డ గుమస్తాలు పామును వెతుక్కుంటూ ఆఫీసు దొడ్డిదారిన పడ్డారు.

అయినా పాము కనిపించలేదు. అందరూ పాముల సంగతులే మాట్లాడుతున్నారు.

తల నెరిసినా ఇంకా 'జంట' దొరకని 'వంటరి' కుమారి శమంతకమణి. "నాగుపాములు ఎప్పుడూ జంటగానే వుంటాయి సార్!" అంది - 'జంట'నే మాటను బోలెడు సిగ్గుతో పలుకుతూ, కులుకుతూ.

ఆ మాట వినగానే సదానందం గారు మళ్ళీ భయంతో గంతులేశారు.

"అయితే దీని జంట పాము ఇంకా ఈ రూంలోనే వుంటుందంటారా?" హెడ్ గుమస్తా దైవసహాయం అన్నాడు.

"తప్పకుండా ఈ గదిలోనే వుంటుంది సార్!" 'సదాకుమారి' శమంతకమణి నొక్కి చెప్పింది.

"మరీ సంగతి ఇందాకట్నుంచి చెప్పవేం తల్లీ?" సదానందంగారు విసుక్కున్నారు.

"ఈ అయిడియా నాకిప్పుడే తట్టింది సార్!" అంది. మళ్ళీ బోలెడు సిగ్గు పడుతూ.

"ఏ ఐడియా? ఈ 'జంట' ఐడియానా?" వ్రేలిమీద వ్రేలు ఎక్కించి చూపిస్తూ కొంటెగా నవ్వుతూ అన్నాడొక కుర్ర గుమస్తా.

మిగతా ఆడవాళ్ళు కిసుక్కుమన్నారు.

"ఒరి మీ నవ్వులు చల్లగుండా. ముందా 'జంట' పాము ఈ గదిలో ఎక్కడ తగలడిందో వెతకండయ్యా!" కోపంగా అన్నారు సదానందం గారు.

ఆఫీసరు గారి ప్రాపకంకోసం అంగలార్చే 'ప్రాపకరాయుళ్లు' ఆ మాట వినగానే నానా హంగామా చేశారు. ఎర్ర తివాచీని ఆసాంతం ఎత్తి చూశారు. సోఫాల సందుల్లో, సోఫాల క్రిందా, బీరువాల్లో, రేక్స్‌ల్లో చూశారు. డ్రాయరు సొరుగులు బయటికి లాగి, ఫైళ్ళూ, కాగితాలూ క్రింద పడేసి చూశారు. అయినా పాము కనిపించలేదు.

ఇంతలో లంచ్ టైం అయింది. 'పాము' ఆరోజు పెద్ద టాపిక్ అయిపోయింది. పాముల సంగతులు చెప్పుకుంటూ ఆఫీసు స్టాఫ్ ఫలహారాలు చేయటానికి వుపక్రమించారు. మరోప్రక్క సదానందంగారు తమ సూపర్‌వైజర్లతో అర్జంటు సమావేశం ఏర్పాటు చేశారు. అసలు ఆఫీసులోకి పాములెలా వస్తున్నాయి. వాట్ని నివారించడానికి తీసుకోవాల్సిన తక్షణ చర్యలూ - ఇవీ, చర్చనీయాంశాలు!

చర్చ కొనసాగుతుండగా బిల్ సెక్షన్లో పన్జేస్తున్న యూ.డి.సి. ఆంజనేయులు దేనికోసమో లోపలికి వచ్చాడు.

మధ్యలో కల్పించుకుంటూ, "పాములు ఇలా రావడానికి ఆఫీసు ఆవరణలో నిలువెత్తున పెరిగిన ఆ గడ్డే కారణం సార్!" అన్నాడు.

"అవున్సార్. ఆ గడ్డే కారణం సార్!" సూపర్‌వైజర్లంతా ఏకకంఠంగా అన్నారు.

హెడ్‌క్లర్క్, "మరే సార్! ఈ మధ్య శమంతకమణి మధ్యాహ్నపు పూట కేంటీన్ కెళ్ళి కాఫీ త్రాగివస్తూ ఈ గడ్డిలోజంటగా క్రీడిస్తున్న రెండు పాముల్ని చూచిందంట!"

ఆఫీసరు : ఈ శమంతకమణి ఎవరండీ బాబు! ఇందాక ఒకామె ఈ రూంలో మరో జంట పాము వుంటుందని చెప్పి నన్నదరగొట్టింది.

అకౌం : ఆమేనండీ శమంతకమణి.

ఆఫీ : ఈమెకన్నీ జంటపాములే కనిపిస్తాయల్లే వుందే మన ప్రాణాలు తీయడానికి?

హె. క్ల : పాపం, ఆమెకింకా పెళ్ళి కాలేదండి!

ఆఫీ : దానికీ, ఈ జంట పాములకీ సమ్మంధం ఏంటయ్యా బాబు?

అకౌం : నేచురల్ కదండీ!

ఆఫీ : ఏంటండీ నేచురల్?

హె. క్ల : జంటలేని వంటరి పిల్లకు అన్నీ జంటలు కనిపించడం!

అకౌం : (వ్యంగ్యంగా) ఆమె పిల్లా?

ఆఫీ : (కోపంగా) వాటీజ్ దిస్సయిసే? అస్సలు విషయం వదిలేసి జంటా, పిల్లా అంటున్నారా? ముందీ పాముల సంగతి చూడండి!

హె. క్ల : ఆంజనేయులన్నట్లు ఈ పాములన్నింటికి ఈ గడ్డే కారణం సార్.

ఆఫీ : మధ్యలో ఈ ఆంజనేయులు ఎవరు?

"నేనేసార్" అంటూ ఆంజనేయులు నమస్కారం చేశాడు.

"వాట్ ఆర్ యూ?" అడిగారు సదానందంగారు.

ఎకౌ : మా ఎకౌంట్స్ సెక్షన్లో యూ.డి.సి. అండీ!

ఆంజనేయులు మళ్ళీ నమస్కారం చేశాడు.

ఆఫీ : కమ్ టుది పాయింట్

ఎకౌ : ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డి మా దారుణంగా పెరిగిపోయిందండీ!

ఆఫీ : (కోపంగా) దారుణంగా పెరిగిపోయిందని కూర్చుంటే ఇవ్వాళ పాములొచ్చాయి. రేపు పులులూ, సింహాలూ వస్తాయి! ముందా గడ్డిని పీకించి పారేయండి!

ఎకౌ : దానికి ఖర్చవుతుంది కదండీ! ఈ పద్దుకు మనకి పవర్సు లేవు కదండీ!

ఆఫీ : (విసుగ్గా) మరెలాగండీ?

ఇంతలో ఆంజనేయులు 'డెలిగేషన్ ఆఫ్ పవర్స్' అనే బుక్ తీసుకొని మళ్ళీ వచ్చాడు. అందులోని ఒక సెక్షన్‌లోని ఒక ఐటంను ఆఫీసరు గారికి చూపించాడు. దాని ప్రకారం, ఆఫీసు మెయిన్‌టేన్స్‌కి డబ్బు ఖర్చు చేయడానికి పవర్స్ వున్నాయని చెప్పాడు.

ఆఫీ : చూడండయ్యా! ఈ కుర్రాడు ఠక్కున ఈ రూల్ చూపించాడు. మీరూ వున్నారు సూపర్‌వైజర్లెందుకు?

హెడ్‌క్లర్క్, అకౌంటెంట్‌న్నూ ఆంజనేయులు వంక గుర్రుగా చూశారు. అతని చేతిలోని పుస్తకాన్ని తీసికొని ఇద్దరూ తలలు ప్రక్క ప్రక్కన పెట్టి ఆ రూల్ చదివారు.

హె. క్ల. : దీని ప్రకారం మీకు ఐదు వందల వరకే పవర్స్ వున్నాయి సార్! దానిపైన ఖర్చు చేయాలంటే హెడ్డాఫీసుకు వ్రాసి స్పెషల్ శాంక్షన్ తెప్పించుకోవాలి!

అకౌం : అది వచ్చేలోపల ఇదొక మహారణ్యంలాగా పెరిగిపోయి మీరన్నట్లు పులులూ, సింహాలూ కూడా రావచ్చు సార్!

ఆఫీ : పోనీ, నా పవర్స్ ఎంత వర్కు వున్నాయో అంతవర్కే చేయించండి.

హె. క్ల. : ఐదొందలకు ఇంత పెద్ద ఆవరణలో ఒక వైపు కూడా గడ్డి తీయించలేమండీ!

ఆఫీ : మరి ఈ సమస్య ఎలాగండి!

ఆంజనేయులు : దీనికొక వుపాయం వుంది సార్! డెలిగేషన్‌లో ఏటేటైం ఐదొందలు మించకుండా ఖర్చు చెయ్యవచ్చునని కదా వుంది. కాబట్టి గడ్డిని మూడు నాలుగు దఫాలుగా పీకించినట్లు డిఫరెంట్ డేట్స్‌ల్లో డిఫరెంట్ వోచర్స్ తీసుకుంటే సరిపోతుంది. దేనికది మీ పవర్స్ లోపల వుంటుంది, మన పనీ అవుతుంది!

అకౌం : ఒకే పద్దును ఇలా విడదీసి చూపించడం అబ్జక్షనవుతుంది సార్!

ఆఫీ : గాడిద గుడ్డవుతుంది! మీ వోల్డ్ పీపుల్ అంతా ఇంతే! రూల్స్ పట్టుక్కూచ్చుంటారు. ఆంజనేయులు లాంటి కుర్రాళ్ళను చూచి నేర్చుకోండయ్యా! మిష్టరాంజనేయులు! యు గో హెడ్! ఈ పనంతా నీవ్వే చేయించు. ఆ గడ్డీ గాదం పీకించి ఆ గ్రౌండంతా క్లీన్ చేయించు!

హెడ్‌క్లర్క్కూ, అకౌంటెంటూ ఒకరి మొగాలు ఒకరు చూచుకున్నారు. ఆంజనేయులు వుషారుగా బయటికి నడిచాడు.

ఆంజనేయులుకు పెళ్ళయిన దగ్గర్నుంచి ఒక కోర్కె వుంది. అర్జంటుగా తనకొక చిన్ని బుజ్జిగాడు పుట్టాలనీ, ఆఫీసు నుంచి యింటికి వెళ్ళగానే ఎంచక్కా ఆ చంటి వెధవతో హాయిగా ఆడుకోవాలనిన్నీ! పెళ్ళయి మూడేళ్ళు దాటిపోయినా యింకా అతని భార్య కడుపు పండలేదు. ఎన్నాళ్ళకీ తన కోర్కె తీర్చడం లేదని అతనికి తన భార్య మీద కోపంగా కూడా వుంది. అట్టి తరుణంలో అతని భార్యకి ఇటీవల వేవిళ్ళు మొదలయ్యాయి. భార్య మీద అంతకు ముందున్న కోపమంతా వల్లమాలిన ప్రేమగా మారిపోయింది. ఆమె రుచులేంటో అడిగి మరీ తెల్సుకొని వాటన్నింటిని తీసికొచ్చి, లాలించి భార్యచేత తినిపిస్తోన్నాడు.

తనకు జున్ను తినాలని వుందని ఆ రోజు వుదయం భార్య చెప్పింది. ఆ విషయం ఆఫీసు నుంచి యింటి కెళ్తుంటే మధ్య దార్లో ఆంజనేయులుకు గుర్తుకు వచ్చింది. వెంటనే తన టీవియస్సును తమకు రోజూ వాడిగ్గా పాలుపోసే పాల రంగమ్మ యింటి వయిపుకి త్రిప్పాడు.

పాల రంగమ్మ పెద్ద ఎత్తున పాల వ్యాపారం చేస్తుంది. ఆమెకు పది దాకా గొడ్డ గేదెలున్నాయి. వాటికి పుట్టిన దూడలూ, దున్నలూ, వాటి పేడా రొచ్చుల్తో, వాటి గడ్డీ గాదంతో రంగమ్మ యిల్లు పెద్ద సంతలాగావుంటుంది.

ఆంజనేయులు వెళ్ళేసరికి రంగమ్మ ఎవరికో శాపనార్థాలు పెట్టుతూంది. గేదెలకు రోజూ గడ్డి మోపులు తెచ్చే వాళ్ళు సరీగ్గా తీసుకురాకుండా ఆమెను నానా యిబ్బందిపెట్టుతున్నారని ఆమె తిట్లను బట్టి గ్రహించాడు. పాల రంగమ్మ గేదెల గడ్డి కోసం పాట్లు పడుతుందని అర్థమవ్వగానే అతనికొక బ్రహ్మాండమైన ఆలోచన తట్టింది. గట్టిగా ఈలేసి ఎగిరి గంతేశాడు!

.... అంతే, సదానందంగారి ఆఫీసు ఆవరణలో మనిషెత్తున పెరిగిపోయిన గడ్డి ఆ మర్నాటి నుంచి కరకు కొడవళ్ళకు కసుక్కున తెగిపోయి, పచ్చగడ్డి మోపులుగా మారిపోతున్నాయి! పాల రంగమ్మ యింటికి చేరుపోతున్నాయి. పాల రంగమ్మ మనుషులే వచ్చి కోసుకుపోతున్నారు. ఆఫీసు గడ్డిని కోసుకోనిచ్చినందుకు మళ్ళీ ఎదురు డబ్బు వసూలు చేస్తున్నాడు ఆంజనేయులు.

ఆఫీసు ఆవరణలో గడ్డి పీకించబడి క్లీన్ అవుతున్నందుకు సదానందం గారు తృప్తిపడ్డారు. పాముల బెడద తీరిపోతుంది గదా అని సంతోషపడ్డారు. పని వాళ్ళకు అడ్వాన్సు ఇవ్వాలని ఆంజనేయులు అయిదొందలకు వోచర్ పెట్టాడు. 'ఓ.కే.' అంటూ దాని మీద తమ సంతకాన్ని పొడిచారు.

ఈ లోపల ఆఫీసరు గారు క్యాంపు కెళ్ళి వారం రోజుల తర్వాత తిరిగి వచ్చాడు. ఆఫీసు ఆవరణలో గడ్డి సగానికి పైగా ఇంకా అలాగే వుంది.

ఆంజనేయుల్ని పిలిపించి, "వాట్ ఆంజనేయులు, వర్క్ స్లోగా జరుగుతున్నట్టుందే!" అని అడిగాడు.

"లేబర్ ప్రాబ్లమ్‌గా వుంది సార్!, అదీగాక, ఈ మధ్య వరసపెట్టి వర్షాలు కురిసేసరికి ఒకప్రక్క నుంచి గడ్డి కోస్తొంటే మరోప్రక్క నుంచి గడ్డి పెరుక్కుంటూ వస్తోంది సార్!" అన్నాడు.

"ఏదో త్వరగా చేయించవయ్యా! ఈ లోపల మళ్ళీ ఏ పామో నా గదిలోకి దూరుతుందని భయంగా వుంది!" అన్నాడు.

"మీకేం భయం లేద్సార్! చూస్తుండండి. యింకో వారం రోజుల్లో గ్రౌండంతా అద్దం లాగా తయారయి పోతుంది!" అంటూ మరో అయిదు వందలకు మరో వోచర్ ముందు పెట్టాడు.

రెండు రోజుల తర్వాత -

సదానందంగారు ఆఫీసుకు రావటమే బజర్ నొక్కి ఆంజనేయుల్ని లోపలికి పిలిపించాడు.

అతనిచేతిలో వున్న కాగితం వంక చూస్తూ, "మళ్ళీ ఇంకో వోచర్ తీసికొచ్చినట్టున్నావు?" అన్నారు.

"అవున్సార్, గడ్డి కోసినందుకు లేబర్ ఛార్జీలు సార్!"

"దీన్తో మొత్తం పదిహేను వందలయింది కదూ! అద్సరేగాని ఆంజనేయులు, ఎవరన్నా మంచిగా పాలు పోసేవాళ్ళను చూచిపెట్టవయ్యా! మా పాలమనిషి వుత్త నీళ్ల పాలు పోస్తోంది!" అన్నారు.

"పాలవాళ్ళకేం కొదవ సార్!"

"అవును, నీవు ఎవరి దగ్గర పాలు పోయించుకుంటున్నావు?"

"పాల రంగమ్మనీ, చిక్కటి పాలు పోస్తుంది సార్!"

"అరే, పాల రంగమ్మా? మాకూ ఆబిడే పోస్తుందయ్యా! మరి మాకలా నీళ్ళ పాలు పోస్తోందేమిటి?' ' వోరగా చూస్తూ అన్నారు.

"మీకూ పాలరంగమ్మేనా సార్ -"

గుటక మ్రింగుతూ అన్నాడు. ఆఫీసరు గారి క్కూడా పాల రంగమ్మే పాలు పోస్తోందన్న విషయం పాపం ఆంజనేయులుకు తెలియదు.

"మిష్టరాంజనేయులు, నేను నీకెలా కనిపిస్తోన్నా?" తలవూగిస్తూ అడిగారు కోపంగా.

"మీరాసార్, మీరు మీలాగే కనిపిస్తోన్నార్ సార్!

"అంతేనా, నేనొక వెర్రి వెంగళాయి లాగానో, చచ్చు సన్నాసీ లాగానో, చవట పీనుగులాగో కనిపిస్తోన్నానా?" వ్యంగ్యంగా అన్నారు.

"అలా అని ఎవరైనా అన్నారా సార్?" మళ్ళీ గబుక్కున నాలిక కొరుక్కున్నాడు.

"ఎవరైనా అంటారయ్యా, నీలాంటి వాడ్ని గ్రుడ్డిగా నమ్మినందుకు!" కోపంగా అన్నాడు.

"అదేంటి సార్ అలా అంటారు?" నీళ్ళు నములుతూ అన్నాడు.

ఆ రోజు ఉదయం పాల రంగమ్మ పాలు పోయటానికి వచ్చినప్పుడు "సారూ, ఆఫీసులో గడ్డి కోసుకున్నందుకు మోపుకు మరీ ఆరు రూపాయలు కట్టించుకుంటున్నారు. బీదదాన్ని అంత యిచ్చుకోలేను. మోపుకు నాల్గు రూపాయలు చేసుకోండయ్యా ధర్మ పెబువులు!" అని సదానందానికి మొరపెట్టుకుంది.

అప్పుడు ఆయనికి అర్థమైంది. ఈ ఆంజనేయులు చేస్తోన్న మోసం! ఆఫీసు గడ్డి కోయిస్తున్నానని చెప్పి ఇటు ఆఫీసు డబ్బూ, ఆఫీసు గడ్డి కోసుకున్నందుకు అటు రంగమ్మ దగ్గిరా డబ్బు గుంజుతున్నాడని తెలిసింది.

"ఆఫీసు గడ్డి కోసుకుంటున్నందుకు పాల రంగమ్మ దగ్గర మోపుకెంత వసూలు చేస్తున్నావు ఆంజనేయులు?" అన్నారు తాపీగా.

ఆంజనేయులుకు ముచ్చెమటలు పోశాయి.

"అమ్మ దొంగముండా, ఎంత పన్జేశావే?" అని పాల రంగమ్మని మనస్సులో తిట్టుకున్నాడు.

అంతలోనే సర్దుకుని, "ఇప్పుడే వస్తా వుండండి సార్!" అని చెప్పి నాల్గు అంగల్లో సెక్షన్‌లోకి వెళ్ళి మళ్ళీ రెండంగల్లో తిరిగి వచ్చాడు.

ఇప్పుడతని చేతిలో ఒక పాకెట్ వుంది. దాన్ని ఆఫీసరుగారి టేబిల్ మీద పెట్టాడు.

"ఇదేంటయ్యా?"

"మీరే చూడండి సార్!"

"ఆయన దాన్ని విప్పి చూశారు. అందులో తళతళా మెరుస్తోన్న క్రొత్త వెండి గిన్నె వుంది.

"ఇదెవరికి?"

"మీకే సార్, మీకు ప్రెజెంట్ చెయ్యాలని ఇంతకు ముందే బజారుకెళ్ళి కొనుక్కొచ్చా సార్!" వస్తోన్న ఏడ్పును దిగమ్రింగుకుంటూ అన్నాడు.

పాపం నిజానికి ఆంజనేయులు దాన్ని తనకు పుట్టబోయే బాబు కోసం కొనుక్కున్నాడు. 'ఆఫీసు గడ్డి' మీద సంపాదించిన డబ్బులు పెట్టి అంతకుముందే బజారుకెళ్ళి కొనుక్కొచ్చాడు. ఇంతలో అనుకోకుండా ఆఫీసరు తనమీద విరుచుకుపడ్డారు. తెలివైన ఆంజనేయులు తనమీదకు పడబోతున్న ఆపద నుంచి కాచుకోవటానికి ఈ వెండి గిన్నెను అడ్డుగా వాడుకున్నాడు.

అనుకోకుండా క్రొత్త వెండి గిన్నె కానుగ్గా రాగానే సదానందంగా చిదానందంగా మారిపోయారు. ఆంజనేయులు పట్ల ప్రసన్నులైనారు.

"వెండిగిన్నె బుజ్జి ముండ ముద్దొస్తోందయ్యా!"

"మీకోసం స్పెషల్‌గా ఆర్డరిచ్చి చేయించాను సార్!" లోపల్లోపల కసిగా తిట్టుకుంటూ అన్నాడు.

"దీని ఖరీదెంత మిస్టరాంజనేయులు?" దాన్ని ఇటూ అటూ త్రిప్పి చూస్తూ అడిగారు.

"పదిహేను వందల పై చిలుకేనండీ!"

"మరి, ఆఫీసు గ్రౌండ్ క్లీన్ చేయించేందుకు రెండువేలు దాకా అవుతుందనుకున్నాం కదయ్యా?' ప్రతి మాటా పట్టిపట్టి పలుకుతూ చిర్నగవులు చిందిస్తూ అన్నారు.

"మిగతా బేలన్స్‌తో తమరికి వెండి పన్నీరుబుడ్డొకటి బహుకరించుకుంటాను సార్!" పొంగి వస్తోన్న ఏడ్పును దిగమ్రింగుకుంటూ అన్నాడు.

"తెల్సుకున్నావు కదా, వెరీగుడ్! మరి ఆ పచ్చగడ్డి మోపులు మీద వచ్చే...." అర్ధోక్తిలో ఆగిపోయారు.

"అయ్యా.... ఆ పచ్చగడ్డి మోపులు నాకు వదిలెయ్యండయ్యా!" పైకే ఏడుస్తూ అన్నాడు.

"సరే, సరే, వాట్ని నీవు మేసేయ్!" తమ సరసోక్తికి తామే పగలబడి నవ్వారు.

ఆఫీసరుగార్ని మనస్సులో తిట్టుకుంటూ ఆంజనేయులు నీర్సంగా కాళ్ళీడ్చుకుంటూ బయటికొచ్చాడు.

* * *

రెండు రోజుల తర్వాత లంచ్ టైంలో ఆఫీసరు గారు ఆంజనేయుల్ని లోపలికి పిలిపించారు. సీట్ ఆఫర్ చేశారు. సాదరంగా మాట్లాడారు.

"నిజంగా నీవు బ్రిలియంట్ వయ్యా ఆంజనేయులు!" అంటూ పొగిడారు. "బ్రహ్మాండమైన ఐడియా వేశావు. అటు ఆఫీసు పనీ, ఇటు నీ పనీ.... వుభయమూ స్వీయతారకంగా-" అతడేమి అంటాడో అని మధ్యలోనే ఆగిపోయాడు.

"స్వీయతారకం కాదు సార్, వుభయ తారకమే!" చేతిని ఆయన వైపూ, తన వైపూ చూపిస్తూ అన్నాడు.

ఆఫీసు కిటికీ లోంచి కనిపిస్తోన్న పెద్ద వేపచెట్టు వంక సాలోచనగా చూస్తూ కొన్ని క్షణాలు మిన్నకుండి ఆ పిదప, "ఈ వెధవ వేపచెట్టు చూడవయ్యా!" అన్నారు.

కిటికీ వంక చూస్తూ, "దానికేం సార్, బ్రహ్మాండంగా వుంది. ఈ ఆఫీసు కట్టక ముందు నుంచీ ఈ ఆవరణలోనే వుంది!" అన్నాడు.

వూరికే జీతాలు తీసుకొని ఏ పనీ చేయకుండా కాలక్షేపం చేసే పబ్లిక్కు సర్వెంట్లు కంటే ఆ వేపచెట్టే నయం! ఏ జీతం నాతం లేకుండా ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో వానకి మొలిచి, 'గాలి'కి పెరిగి పెద్దవృక్షంగా నిల్చింది: అందరూ విడిచే బొగ్గుపులుసు వాయువుని పీల్చి, అందరికీ కావల్సిన ప్రాణవాయువుని సరఫరా చేస్తూ చిక్కటి నీడను, చక్కటి గాలినీ అందరికీ పంచుతూ, ఎంతో వుపయోగకారిగా వుంది.

సదానందంగారు చిరాగ్గా మొగం పెట్టి "ఇదొక పెద్ద న్యూసెన్సుగా వుంది. పనిలో పని దీని సంగతి చూడ్రాదూ?" అన్నారు.

"ప్రభుత్వం వారు 'చెట్లు నాటండీ' అంటుంటే మీరు చెట్టు పడగొట్టండి అంటున్నారేం సార్!" ఆశ్చర్యంగా అన్నాడు.

ఆయన మర్మగర్భంగా మందహాసం చేస్తూ, "ప్రభుత్వం వారు చెట్టు నాటమన్నారు కానీ, న్యూసెన్స్‌గా వున్న చెట్లను పడగొట్టవద్దని చెప్పలేదు కదయ్యా?" అన్నారు.

ఆంజనేయులు అర్థం కాలేదన్నట్లు బుర్ర గోక్కుంటూ "అందరికీ అన్ని విధాలుగా వుపయోగపడుతున్న ఇంత మంచి చెట్టుని న్యూసెన్సు అని ఎలా చూపిస్తామండీ?" అన్నాడు.

"అది మనం వ్రాసే నోట్‌ని బట్టీ, మనం చూపించే జస్టిఫికేషన్ బట్టీ వుంటుందయ్యా ఆంజనేయులు! ఈ వేపచెట్టునే తీస్కో! ఇది ముసలిదయి పోయింది. ఎప్పుడు ఎవరి మీద పడుతుందో తెలియదు. గాలి వానలకు అటు పడితే ఆఫీసు కాంపౌండు గోడ కూలిపోతుంది. ఇటు పడితే ఎప్పుడు దాని క్రింద వుండే ఆఫీసు వాహనాలు మీద పడి ప్రభుత్వ ఆస్థికి అపార నష్టం వాటిల్లుతుంది. ఆఫీసుకొచ్చే ఆఫీసు స్టాఫ్ దాని క్రిందుగానడిచి వస్తోన్నప్పుడు ఈ ముసలి చెట్టు వాళ్లమీద గనుక పడితే 'డ్యూటీలో వున్నప్పుడు జరిగే అపాయాల చట్టం క్రింద బోలెడు నష్టపరిహారం ఇవ్వవలసి వస్తుంది!

అదిన్నీ గాక, దాని చెత్తా చెదారం మాటిమాటికి గాలికి ఆఫీసు లోపలికి కొట్టుకువస్తుంది. దాన్ని వూడిపించాలంటే వున్న తుడుపు పని వారికి అధిక భారమౌతుంది. ఇలా..."

"ఇక చెప్పొద్దు సార్! అమ్మో అమ్మో అసలు బ్రిలియంట్ మీరు సార్!" అని గుండెలు బాదుకున్నాడు.

సదానందంగారు చిదానందం లాగా చిరుహాసాన్ని చిందించారు.

'గడ్డి రుచి' మరిగి పెద్ద చెట్టుకే పెటకం పెట్టావా తండ్రీ! అని మనస్సులోనే తిట్టుకున్నాడు ఆంజనేయులు.

- ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

*9 మార్చి 1990*

★